క్లుప్తంగా

బీటీ పనులు ప్రారంభం



వీపనగండ్ల: మండలంలోని తూంకుంట క్రాస్ రోడ్డు నుంచి వల్లభాపురం, తెల్లరాళ్లపల్లి ఆర్ అండ్‌బీ రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు సోమవారం బీటీ పనులు ప్రారంభించారు. రూ.1.25కోట్లతో 8.9 కిలోమీటర్ల మేర నిర్మించనున్న తారురోడ్డు పనులు ప్రారంభం కావడంతో పలు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. పనులను సైట్ ఇంజినీర్ వెంకటరమణ పరిశీలించారు.

రూ.లక్ష విరాళం



పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా పునర్నిర్మించనున్న సీతారామాంజనేయ ఆలయానికి పాన్‌గల్‌కు చెందిన పెద్దకృష్ణారావు జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.లక్ష ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని పియదర్శిని జూరాల ప్రాజెక్ట్ క్యాంప్‌లో స్టేడియం కోసం చేపడుతున్న నిర్మాణాల పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కృషితో పట్టణ అభివృద్ధిలో భాగంగా క్యాంప్‌లో 10 ఎకరాల భూమి కేటాయించి స్టేడియం, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి నిర్మాణాలకు పాత భవనాలు కూల్చవేశారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, నాయకులు సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ అసిస్టెంట్ మృతికి సంతాపం



వనపర్తి క్రైం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేసిన శివకుమార్ అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఆయన మృతిపట్ల సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ముందుగా ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్రకుమార్ శివకుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావాల్సిన నష్టపరిహారం, కారుణ్య నియామకం జరిగేలా చూస్తానని సూపరింటెండెంట్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, వైద్యులు నవీన్‌కుమార్, బండారు శ్రీనివాసులు, రాజేందర్‌రెడ్డి, తులసీ దాస్, ఉమాపతి, లక్ష్మి, కిశోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు ప్రాథమిక పాఠశాలను సోమవారం జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆల సహకారంతో చేపట్టిన పనులను పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బ్రహ్మమ్మ, పీఆర్ఏఈ నరేష్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, పంచాయతీ సెక్రెటరీ రవికుమార్, శాంతమూర్తి ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

వనపర్తి: జిల్లా కేంద్రానికి చెందిన పలువురు భవన నిర్మాణ కార్మికులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం రాత్రి తన క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో నాగన్న, మల్లేష్, కృష్ణయ్య, రాములు, బాలకృష్ణ మరికొందరు ఉన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, బీచుపల్లియాదవ్ తదితరులు ఉన్నారు.

శివసేనారెడ్డి ఎంపికపై హర్షం

వనపర్తి: మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డికి ఏఐసీసీలో మెంబర్‌గా స్థానం లభించటం హర్షణీయమని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండుసాగర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అధికారులు గైర్హాజరు

- తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ గుంత మౌనిక
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని వెల్లడి



మాట్లాడుతున్న ఎంపీపీ గుంత మౌనిక



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

కొత్తకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా కొనసాగింది. ఎంపీపీ గుంత మౌనిక అధ్యక్షతన జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీడీఓ శ్రీపాద సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమైన శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సమావేశం తూతూ మంత్రంగానే నడిచింది. ఈ సందర్భంగా ఎంపీపీ గుంత మౌనిక మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు ముఖ్యమైన శాఖల అధికారులు రాకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరయిన అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు ప్రారంభమైనందున తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో ఉన్న సమస్యలను సభలో ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు సమకూర్చాలని కోరారు. సమావేశంలో పశువైద్యాధికారి విజయకుమార్, పంచాయతీరాజ్ ఏఈ షబ్బీర్, ఎంపీటీసీ సభ్యులు పద్మమ్మ, లక్ష్మణ్‌నాయక్, రంగారెడ్డి, శేషిరెడ్డి, లక్ష్మి, శైలజ, రాధ, కో ఆప్షన్ సభ్యులు అల్లాభాష, సర్పంచ్‌లు శ్రీనివాసులు, వెంకటరామారెడ్డి, బుచ్చన్న, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మదనాపురంలో ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



అమరచింతలో..



బాలకిష్టాపూర్‌లో..

అమరచింత: అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంతో పాటు నాగల్‌కడ్మూర్‌లోని శ్రీ దేవేంద్రచార్యుల మఠంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రతి నెల అమవాస్య సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దేవేంద్రచార్యుల మఠానికి వస్తుంటారని, భక్తుల సౌకర్యార్థం వసతులను కల్పించామని మఠం నిర్వాహకుడు నరసింహాచార్యులు తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమవాస్య పూజల అనంతరం పాల్గొన్న భక్తులందరికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కూరగాయల రాయప్ప, రంగు మనోహర్, బండారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని అభయంజనేయ స్వామి విగ్రహం వద్ద అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం గ్రామానికి చెందిన వడ్డె వెంకటయ్య కుమారుడు రమేష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంనారాయణ, మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, వేద పండితులు గోపాలకృష్ణ, నాయకులు వెంకట్‌నారాయణ, బాలకృష్ణ, వెంకటేష్‌యాదవ్, రాములు, శంకర్ యాదవ్, సూరిబాబు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం...

ఆత్మకూర్: అమావాస్యను శ్రీఅభయ ఆంజేయస్వామి ఆలయంలో పురస్కరించుకుని సోమవారం పూజారి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బాలకిష్టపూర్ శివారులోని శ్రీఆంజేయస్వామి ఆలయంలో శృతి జువెల్లర్స్ అధినేత గాడి లక్ష్మీనారాయణ, గాడి చైతన్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతినెల అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. సర్పంచ్ తుకరాంనాయక్, మాజీసర్పంచ్ సత్యన్న, నిర్వాహకులు చిరంజీవీ, మాసన్న, చంద్రయ్య, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయం వద్ద..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకుడు కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదానం చేశారు.

మహిళ అదృశ్యం

గోపాల్‌పేట: స్థానిక పీఎస్‌లో సోమవారం మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్ఐ మల్లేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తిర్మలాపూర్‌కు చెందిన కొమ్ముల రేణుక వనపర్తిలోని ఒ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. ఈనెల 16న రోజు మాదిరిగానే డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారిని సంప్రదించినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రికార్డుల పరిశీలన



కొత్తకోట రూరల్: పెద్దమందడి గ్రామ పంచాయతీలో గల పలు రికార్డులను ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి పరిశీలించారు. రికార్డుల నమోదు తీరు సరిగ్గా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. తడి, పొడి చెత్త షెడ్ ద్వారా కంపోస్ట్ ఎరువును తయారు చేసి గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల చుట్టు పాదులు చేసి నీళ్ల పట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ శ్రీరామ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తులు, బూట్లు అందజేత



ఆత్మకూర్: పట్టణంలోని మినీస్టేడియంలో శిక్షణ పొందుతున్న వాలీబాల్ క్రీడాకారులకు జన్‌కో ఉద్యోగులు తరుణ్, రవి సోమవారం రాత్రి దుస్తులు, బాట్లు, వాలీబాల్ అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను ప్రభుత్వం ఆదరించాలని, క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో కోచ్‌లు ఖాదర్, బాలు, కిషోర్, దివాకర్, భాను, అరుణ్, చిన్ననర్సింహ, అఫ్రోజ్, భరత్, సిరాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు మదర్సా వార్షికోత్సవం

ఆత్మకూర్: పట్టణంలోని మదర్సా ఇమాదుల్ ఉలూం (అరబ్బీ పాఠశాల) 22వ వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ హఫీజ్ జియా ఉర్ రహ్మన్, హెడ్‌మాస్టర్ హాఫీస్ రఫియోద్దీన్ తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఇక్కడ దివ్యఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులకు సన్మానం నిర్వహిస్తారన్నారు. ముహ్మద్ ప్రవక్త దివ్య సూక్తులను తెలంగాణ, ఆంధ్ర అరబ్బిక్ స్కూల్స్ అధ్యక్షుడు మౌలానా జమాలుర్ రహ్మన్, మౌలానా అహ్మద్‌మీజ్‌సాహేబ్, మౌలానా జుబేర్‌అహ్మద్‌ఖాన్, ప్రముఖ మౌలానాలు, ప్రసంగీకులు దైవ సందేశమిస్తారని తెలిపారు.

నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం రంగసముద్రం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నాగరాల మూడు భాగాలుగా విడిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు సెంటర్లుగా ఏర్పడ్డ గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ప్రజలు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీధర్, నరేందర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, శివనారాయణ, నరసింహ, శివుడు, చందు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వర్ధంతి సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

వీపనగండ్ల: మావోయిస్టుల చేతిలో అమరుడైన కామ్రేడ్ నర్సింహా 32వ వర్ధంతి మహాసభను మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి తెలిపారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ఆయన వెల్లడించారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహిస్తున్నామని, ఈ వర్ధంతి సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శివర్గ సభ్యులు మురళీ, ఆది, ఈశ్వర్, వెంకటయ్య, లక్ష్మణ్, రామకృష్ణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి వివరిస్తాం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గడప గడపకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అమలు చేసే సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో హాత్‌సే హాత్ జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. గ్రామంలో ఆసరా పింఛన్లకు అర్హత ఉన్నా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అనే నెపంతో పింఛన్ రాకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ, రూ.500కే సిలిండర్ అందిస్తామనే హామీలను ప్రజలకు వివరించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి



సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాన్‌గల్: సేవాలాల్ ఆశయ సాధనే లక్ష్యంగా గిరిజనులు ఐకమత్యంతో ముందుకు సాగాలని కొల్లాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంజారాల మార్గదర్శకుడు, పోరాట యోధుడు, తండాల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ శాంతమ్మ, విండో డైరెక్టర్ బిల్యానాయక్, ఉప సర్పంచ్ బొజ్జి, కిషన్‌నాయక్, రవినాయక్, భాస్కర్‌నాయక్, సోమ్లనాయక్, చిట్టెమ్మ, సీతమ్మ పాల్గొన్నారు.

బీమా నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నిక్సన్

కొత్తకోట రూరల్: భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బీమా నిధులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెద్దమందడి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా మోటర్ సైకిల్స్‌ను భవన నిర్మాణ కార్మికులకు వెంటనే ఇవ్వాలని, ప్రమాద బీమా ప్రస్తుతం ఇస్తున్న రూ.6లక్షలను రూ.10లక్షలకు పెంచాలని, సహజ మరణం కింద ఇస్తున్న రూ.1లక్షను రూ.5లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. 2009 నుంచి నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు రెన్యూవల్ చేయాలన్నారు. 1979 వలస కార్మికుల చట్టాన్ని 1996 నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కృష్ణయ్య, రామకృష్ణ, కురుమూర్తి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

స్వయంభు పరమేశ్వరస్వామి జాతర



దాసంగాలు సమర్పిస్తున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారలోని చెరువులో వెలసిన స్వయంభు పరమేశ్వరస్వామి జాతర సోమవారం ప్రారంభమైంది. 21, 22, 23వ తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు రాత్రి 9గంటలకు తేరు మహోత్సవం కనులపండువగా జరుగనుంది. సోమవారం ఆలయ పూజారి కర్నసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి దాసాంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పల్లకీ సేవ పట్టణ పురవీధుల గుండా సాగి ఆలయానికి చేరిన అనంతరం తేరుమహోత్సవాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. చెరువులో నీటి ఉధృతి అధికంగా ఉన్న కారణంగా భక్తులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళ, బుధ, గురువారం రాత్రిల్లో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతోపాటు పల్లకీసేవ, రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

గ్రామపంచాయతీలకే నేరుగా కేంద్రం నిధులు



మాట్లాడుతున్న శ్రీశైలం

ఖిల్లాఘనపురం: గ్రామపంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నేరుగా ఖాతాల్లోనే నిధులు జమ చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అప్పారెడ్డిపల్లి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ప్రజా గోస–బీజేపీ భరోసా యాత్ర కార్నర్ మీటింగ్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్, బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి బెన్నూరు ఆశన్న అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ పేదల కోసం ఆయుష్మాన్ భారత్, ఉచిత రేషన్ బియ్యం తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో నేరుగా కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కేంద్ర పథకాలు రాష్ట్రంలోని పేదలకు అందకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డుకుంటున్నారని.. బీఆర్ఎస్ పాలన చూసి తెలంగాణ తల్లి ఆత్మ ఘోషిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు 3 ఎకరాల భూ పంపిణీ, ముఖ్యమంత్రి పదవి ఎక్కడా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, మండల ఉపాధ్యక్షుడు రాంచందర్, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, శివశంకర్, బూత్ అధ్యక్షుడు ఈదమ్మ, నాయకులు మల్లేష్, భద్రయ్య, వెంకటరమణ, రవీంద్రాచారి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం'



మాట్లాడుతున్న శ్రీరామ్

పాన్‌గల్: రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు శ్రీరామ్ అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్ల స్థలాలు, పోడు భూముల పట్టాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, పంట రుణమాఫీ, నిరుద్యోగభృతి తదితర వాటి సాధనకు నిరంతరం పోరాడుతున్నామన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందుత్వం పేరుతో యువతను రెచ్చగొడుతూ మత విద్వేషాలు నింపుతోందని.. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాసమస్యలపై పోరాడుతూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ కాకం బాలస్వామి, సహదేవ్, రాముడు, పరందాములు, శంకరయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మమ్మ అన్నారు. ఆమె సోమవారం శ్రీరంగాపురం మండలంలోని నాగరాల రెండో అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాలను తప్పని సరిగా తీసుకోవాలన్నారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి బాలమృతం, గుడ్లు అందించాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, కార్యదర్శి మునిగౌడ్, అంగన్‌వాడీ టీచరు కళావతి పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

కొత్తకోట రూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దమందడి మండలంలోని మంగంపల్లిలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంగన్‌వాడీ టీచర్ నారాయణమ్మ తెలిపారు. చిన్నారులు, బాలింతల్లో పౌష్టికాహారం లోపాలను గుర్తించి ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టేందుకు అంగన్‌వాడీ సేవలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆమె అన్నారు.

'సమస్యలు పరిష్కరించే వారినే గెలిపించండి'

వీపనగండ్ల: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పనిచేస్తున్న పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కాటేపల్లి జనార్దన్‌రెడ్డినే గెలిపించాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తలకంటి మహిపాల్‌రెడ్డి, రాయినిపల్లి శ్రీనివాసులు కోరారు. సోమవారం మండల కేంద్రంతో పాటు సంగినేనిపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలలు, కేజీబీవీల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, మహేశ్, స్వామి, శేషయ్య, తిరుపతిరెడ్డి ఉన్నారు.

మొక్కలు సంరక్షించాలి

కొత్తకోట రూరల్: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల్లో మొక్కలు ఎండకుండా చూసుకోవాలని పెద్దమందడి ఎంపీడీఓ అఫ్జల్ నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండలంలోని బుగ్గపల్లితండా పరిధిలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాన్ని ఎంపీడీఓ పరిశీలించారు.

వంతెన నిర్మాణంలో అలసత్వం వద్దు

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో వంతెన నిర్మాణ పనుల్లో అధికారులు అలసత్వం చూపుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ కుతుబ్ అన్నారు. గతేడాది వంతెన నిర్మాణం కోసం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన అధికారులు ఇప్పటి వరకు పనులను ప్రారంభించక పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వంతెన నిర్మించాలని పలు మార్లు విన్నవించినా.. వానకాలం తర్వాత నిర్మిస్తామని చెప్పిన అధికారులు చలికాలం పూర్తయిన నిర్మించడం లేదని ఆరోపించారు. కొంకన్‌వానిపల్లికి చెందిన రైతులు తమ పంటపొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడి నుంచి చిన్నచింతకుంట మండల కేంద్రానికి రవాణా వ్యవస్థ ఉన్న వంతెన లేకపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో రాజు, మహేష్, అంజి, మరియప్ప, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

ఖిల్లాఘనపురం: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఖిల్లాఘనపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కమాలోద్దీన్‌పూర్ వైద్యాధికారి సౌజన్యలత అన్నారు. సోమవారం మండలంలోని షాపురం, తిర్మలాయపల్లి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. మండలంలో సోమవారం మొత్తం 318 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 28 మంది కంటి అద్దాలు పంపిణీ చేయగా 22 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించడం జరిగిందన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేట పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 155 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో తొమ్మిది మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ, 29 మందికి అద్దాల తయారీకి పంపిచామన్నారు. 12మందిని ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామని తెలిపారు.